చెక్ 'డ్యామేజ్'..!

● నెర్రెలు బారిన ఆనకట్ట
● రబీ సాగుకు నీటి బెంగ


తెగిపోయిన ఆకేరువాగు కుడి ఆనకట్ట

చిన్నగూడూరు: రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యాం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని చిన్నగూడూరు–ఉగ్గంపల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న ఆకేరువాగుపై 1964లో అప్పటి మంత్రి నూకల రాంచంద్రారెడ్డి ఆనకట్ట నిర్మించారు. ఏళ్ల చరిత్ర కలిగిన చిన్నగూడూరు ఆకేరువాగుకు గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు భారీగా వరదనీరు చేరి చెక్‌డ్యాం కుడి ఆనకట్టకు గండిపడి తెగిపోయింది. ఏడాది గడుస్తున్నా పాలకులు ఆకేరువాగు ఆనకట్ట వైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న మోస్తరు వర్షాలకు ఆకేరువాగులో వరదనీరు చేరి నీళ్లు నిలిచే పరిస్థితి లేక వచ్చిన నీరు వచ్చినట్లే దిగువకు వృథాగా పోతున్నాయి. గతేడాది భారీ వర్షాలు కురిసి వాగులో జలకళ సంతరించుకోగా, నేడు రాళ్లు రప్పలతో దర్శనమిస్తూ కళాహీనంగా మారి వెలవెలబోతుంది.

ఆందోళనలో రైతులు

వాగునే నమ్ముకుని మండలంలోని చిన్నగూడూరు, ఉగ్గంపల్లి, ధూమ్యతండా, జయ్యారం, విస్సంపల్లి, మన్నెగూడెం ప్రాంతాల రైతులు సుమారు 1500 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేస్తున్నారు. ఇప్పటికే బావుల కింద పొలాల రైతులు నాట్లు వేశారు. ఆకేరు వాగు పరిసర ప్రాంత రైతులు నారుమడులు దున్ని నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే వరుణదేవుడు కరుణించక వర్షాలు సమృద్ధిగా కురవడం లేదు. ఎగువన కురిసిన వర్షాలకు వాగులో చేరిన నీళ్లు కూడా వృథాగా పోతుండడంతో సాగుకు నీటి బెంగ తప్పడం లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగి సీజన్‌ను తలపించేలా వానాకాలంలో అదే పరిస్థితి ఉండడంతో ప్రస్తుతం వానాకాలమేనా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ఆనకట్ట తెగి సుమారు ఏడాది గడుస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటూ స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆకేరువాగు చెక్‌డ్యాం, కుడికాల్వకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి రైతన్నలకు సాగునీటి కష్టాలు లేకుండా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.


నాడు మత్తడి పోస్తూ జలకళ సంతరించుకున్న ఆకేరువాగు (ఫైల్)


నేడు రాళ్లు రప్పలతో వెలవెలబోతున్న ఆకేరువాగు

ప్రభుత్వానికి నివేదిక పంపించాం..

మండలంలోని ఆకేరువాగును పరిశీలించాం. ఆకేరువాగు కుడి ఆనకట్ట తెగిపోగా, చెక్‌డ్యాంకు కూడా పగుళ్లు ఏర్పడ్డాయి. ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. కానీ కొన్ని రీమార్క్స్ కారణంగా ప్రభుత్వం నుంచి నివేదిక వెనుకకు వచ్చింది. మరల పూర్తి నివేదిక ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే త్వరితగతిన పనులు ప్రారంభిస్తాం.

– పొట్టయ్య, ఇరిగేషన్ డీఈ

బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దు

● మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్


మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మహబూబాబాద్: బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడవద్దని, పార్టీ వారికి అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కాళేశ్వర ప్రాజెక్ట్‌పై కమిషన్‌పై ఆన్‌లైన్ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఎల్ఈడీ ద్వారా ప్రసంగాన్ని శంకర్‌నాయక్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి వీక్షించారు. ఈసందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. హరీశ్‌రావు కాళేశ్వరం గురించి వివరించిన విషయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కేసులు పెట్టి బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని వారి పేర్లు రాసుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే వారికి తగిన బుద్ధి చెబుతామన్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయిని రంజిత్, లూనావత్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మల్లారెడ్డి

మహబూబాబాద్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 19నెలలు కావస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈనెల 23న హైదరాబాద్‌లో భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మురళీకృష్ణ, బలాష్టి రమేష్, భాస్కర్, యాకుబ్, విష్ణువర్ధన్, దేవేందర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

దంతాలపల్లి: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అవుతుందని పార్టీ జిల్లా ఎన్నికల కన్వీనర్ చీకటి మహేష్ అన్నారు. మండల కేంద్రంలోని 14వ బూత్‌లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యురాలు సరెడ్డి రాణి రెడ్డి, మండల అధ్యక్షుడు గుండగాని భరత్, కారుపోతుల ఉప్పలయ్య పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామీణ వికాసం

డోర్నకల్: బీజేపీతోనే గ్రామీణ వికాసం సాధ్యమవుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్ పేర్కొన్నారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గొల్లచర్ల గ్రామంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మినారాయణ, నాయకులు బండ్ల విజయ్, ఊడ్గుల శ్రీనివాస్, తోట అప్పారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా నిలవాలి

తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అండగా నిలవాలని మాజీ సర్పంచ్ ధారావత్ రాజేష్ నాయక్ అన్నారు. మంగళవారం అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో టై, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సరిత, ఉపాధ్యాయులు సునీత, సంధ్యారాణి, ప్రవీణ్, శిరీష, యమునలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్సై

మహబూబాబాద్ రూరల్: ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ను కొత్తగూడ ఎస్సై రాజ్ కుమార్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్సై రాజ్‌కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి బదిలీపై వచ్చి జిల్లాలోని కొత్తగూడ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

పెండింగ్ కిరాయిలు చెల్లించాలి

మరిపెడ రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కాంప్లెక్స్ షాపుల పెండింగ్ కిరాయిలు ప్రతీ ఒక్కరు చెల్లించాల్సిందేనని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎంపీడీఓ కాంప్లెక్స్‌లోని 20 షాపులు ఉండగా ఇందులో 5షాపుల కిరాయిలు చెల్లించడం లేదన్నారు. పలు షాపుల నిర్వాహకులు మాట్లాడుతూ.. షాపుల ఎదుట చిల్లర దుకాణాలు పెట్టి అడ్డుగా ఉంటున్నారని తెలిపారు. చిల్లర దుకాణాలు తొలగించేలా కృషి చేయనున్నట్లు ఎంపీడీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమ్లనాయక్, జూనియర్ అసిస్టెంట్ రమేష్‌బాబు, షాపు నిర్వాహకులు పాల్గొన్నారు.

డీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శిగా సాయి

మహబూబాబాద్ అర్బన్: డీఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కేలోతు సాయికుమార్‌ను, రాష్ట్ర కోశాధికారిగా గుగులోతు సూర్య ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ మంగళవారం తెలిపారు.

చెత్తను తొలగించాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపాలిటీలోని చెత్తను డంపింగ్ యార్డులో వేయకుండా రోడ్లపై వేస్తున్నారని, దీంతో రోడ్డుపై వెళ్లాలంటే కంపుతో నడవలేక పోతున్నామని గాంధీపురం ప్రజలు కరుణాకర్ రెడ్డి, ఎడ్ల రమేష్ తెలిపారు. మంగళవారం గాంధీపురంలో చెత్తబండ్లను అడ్డుకొని ఆందోళన నిర్వహించారు.

తల్లిపాల వారోత్సవాలు

కురవి: సీరోలు మండలం తాల్లసంకీస తోపాటు శివారు తండాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు వనజ, మంగతాయి పాల్గొన్నారు.

ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఫక్రుద్దీన్



మరిపెడ రూరల్: మరిపెడ మండల కేంద్రానికి చెందిన షేక్ ఫక్రుద్దీన్‌కు ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డు–2025కు ఎంపికయ్యాడు. ఆగస్టు 18న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో జరిగే ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో అందుకోనున్నట్లు తెలిపారు.

ఢిల్లీ పోరుబాటలో జిల్లా నాయకులు

మహబూబాబాద్ రూరల్: బీసీల 42శాతం రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదం కావడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకుగాను చేపట్టిన ఢిల్లీ పోరుబాట కార్యక్రమానికి ప్రత్యేక రైలులో జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం బయలుదేరివెళ్లారు.

బీఆర్ఎస్‌ను బద్నాం చేస్తున్న కాంగ్రెస్

● మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్


మాట్లాడుతున్న రెడ్యానాయక్

మరిపెడ: బీఆర్ఎస్ పార్టీని, మాజీ సీఎం కేసీఆర్‌ను బదనాం చేయడమే పనిగా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని నవీన్‌రావు గెస్ట్ హౌజ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వంద స్తంభాల్లో ఏదో రెండు స్తంభాలు కుంగినంత మాత్రాన బీఆర్ఎస్‌ను అబాస్‌పాలు చేయడమే కాక, రైతుల లక్షలాది ఎకరాలకు సాగు జలాలు అందించకుండా ప్రాజెక్టులను నిలిపివేయడం దారుణమన్నారు. రేవంత్ రెడ్డి ప్రజలకు అమలు కానీ హామీలు ఇచ్చాడని, ఇప్పుడు అవి ఏమయ్యాయని రెడ్యానాయక్ ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ పేరిట నిరుద్యోగులను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచి తీరుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, గాదె అశోక్‌రెడ్డి, గడ్డం వెంకన్న, జర్పుల కాలునాయక్, తేజావత్ రవీందర్‌నాయక్, అజ్మీర హరినాయక్, బొల్లం నర్సయ్య పాల్గొన్నారు.

పంటను ధ్వంసం చేసిన వ్యాపారి

కొత్తగూడ: ఆదివాసీ రైతు సాగు చేసుకున్న పంట చేనును వ్యాపారి ధ్వంసం చేసిన సంఘటన కొత్తగూడ మండలం కొత్తపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. బాధిత రైతు మోకాళ్ల సమ్మక్క తెలిపిన వివరాల ప్రకారం.. తనకున్న రెండెకరాల భూమిని వ్యాపారి ఢిల్లీ మోహన్‌రావుకు కౌలుకు ఇచ్చాం. మూడేళ్లు కౌలుకు చేసిన అనంతరం భూమి తనదే నీకు భూమి ఎక్కడిది అని బెదిరిస్తున్నట్లు తెలిపారు. ఈ సారి సొంతగా మొక్కజొన్న వేసుకున్నట్లు సమ్మక్క తెలిపారు. మోహన్‌రావు తనకున్న ట్రాక్టర్‌లతో మొక్కజొన్న చేనును ధ్వంసం చేశాడు. వెళ్లి చూడగా ట్రాక్టర్ ఎక్కించి చంపుతా అని బెదిరించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమ్మక్క తెలిపారు. ధ్వంసం చేసిన గిరిజనేతర వ్యాపారి మోహన్‌రావుపై చట్టపరమైన చర్య తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు ఆగబోయిన రవి డిమాండ్ చేశాడు.

రైల్వే కీమెన్ ఇంట్లో చోరీ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో కీమెన్‌గా పనిచేస్తున్న మునగాల రమేశ్ ఇంట్లో దొంగలు పడి తులంన్నర బంగారు, 23 తులాల వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధిత కుటుంబీకులు సోమవారం సాయంత్రం గార్లలో గల తమ బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటి వెనక తలుపులు తీసి ఉండగా పక్కింటి వారు రమేశ్‌కు ఫోన్ చేశారు. ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా పగలగొట్టి తులంన్నర బంగారు, 23 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గార్ల: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం పాతపోచారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం పాతపోచారం గ్రామానికి చెందిన షేక్ అంకుష్ (41) ఐదేళ్లుగా మద్యానికి బానిస కావడంతో పక్షవాతం వచ్చి కాలు చేయి పడిపోయింది. నాటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో కలుపు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి అన్న రఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా వెల్లడించారు.

చికిత్స పొందుతున్న తాపీమేస్త్రీ మృతి

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ తాపీమేస్త్రీ మృతిచెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారంకలాన్ గ్రామం వద్ద జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారిలో పట్టణానికి చెందిన బానోత్ లాలు మేస్త్రీ (50) ఉన్నాడు. కాగా లాలు హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య గంగ, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నిర్లక్ష్యం చేస్తే పోరాటం తప్పదు


వినతిపత్రం ఇస్తున్న చైర్మన్ తిరుపతిరెడ్డి

తొర్రూరు రూరల్: తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే పోరాటాలు తప్పవని తొర్రూరు మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అరిపిరాల గ్రామంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన, ధర్నా కార్యక్రమానికి మద్దతుగా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతిపత్రాన్ని అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు మద్దతుగా శాసనసభలో తీర్మానం చేసి, ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చి, గవర్నర్, కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపిస్తే నిర్లక్ష్యం చేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌రావు, నాయకులు రామసహాయం కిశోర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు మేరుగు మల్లేశంగౌడ్, జాటోతు బాలునాయక్, హనుమాండ్ల నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి


భూ పోరాట కేంద్రంలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

నెహ్రూసెంటర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని భూపోరాట కేంద్రంలో ప్రజల సమస్యలపై మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సాదుల శ్రీనివాస్ మాట్లాడారు. కుల, మతాల మధ్య చిచ్చు పెడుతూ బీజేపీ ప్రభుత్వం, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఇంటి నంబర్లు, పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలను అభివృద్ధి చేయాలి


పూర్తికాని కల్వర్టును చూపుతున్న నాయకుడు

గూడూరు: గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగని మారుమూల గ్రామాలను అభివృద్ధి చేయాలని సీపీఐ మండల కన్వీనర్ మాలోతు రవీందర్‌నాయక్ కోరారు. మండలంలోని భూపతిపేడ, రెడ్డిపల్లె, సీతానగరం, కొమ్ములవంచ గ్రామాలలో మంగళవారం పార్టీ తరఫున పర్యటించారు. అనంతరం భూపతిపేట శివారులో నిర్మితమై బ్రిడ్జి వద్ద నిర్లక్ష్యంగా వదిలిన పనులను చూపారు. ఇక జీపీ పరిధిలోని గిరిజన తండాలలో రోడ్డు, విద్య, వైద్య సౌకర్యాలకు ఇబ్బంది ఉందన్నారు. అదే విధంగా భూపతిపేట నుంచి సీతానగరం శివారులోని పర్యాటక కేంద్రమైన భీమునిపాద జలపాతం వరకు రోడ్డు సౌకర్యం సరిగా లేక, గుంతలతో పర్యాటకుల వాహనాలకు ఇబ్బందులు కల్గుతున్నాయన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాలలో మౌళిక వసతులు కల్పించాలని కోరారు. పార్టీ కార్యకర్తలు ధరంసోతు బిచ్చు, బోడ రవి, గుగులోతు వెంకన్న పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తినని విద్యార్థులు

కురవి: సీరోలు మండలం చింతపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగా లేదని కొందరు విద్యార్థులు భోజనం చేయకుండా పస్తులున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చింతపల్లి శివారులోని పెద్ద లాల్ తండా గ్రామానికి చెందిన సుమారు 12 మంది విద్యార్థులు ప్రాథమిక పాఠశాలకు ఆటోలో వస్తున్నారు. మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో భోజనం బాగాలేదని విద్యార్థులు భోజనం తినకుండా ఉన్నారు. భోజనం సరిగా వండలేదని అడిగిన టీచర్‌తో వంట చేసే వ్యక్తి గొడవపడినట్లు సమాచారం. ఇదే విషయమై సీరోలు ఎంఈఓ ఇస్లావత్ లచ్చిరాంనాయక్‌ను వివరణ కోరగా మధ్యాహ్నం భోజనం చేయని విషయమై విచారణ చేసి చర్య తీసుకుంటున్నట్లు తెలిపారు.

చెక్కు అందజేత

కొత్తగూడ: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులోపడి మృతి చెందిన ఆగబోయిన నరేష్ కుటుంబ సభ్యులకు ఐటీడీఏ ద్వారా మంజూరైన రూ.25వేల చెక్కును మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్ బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

స్థానిక ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

గూడూరు: ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ మండల యువ నాయకుడు బానోతు బాస్కర్‌నాయక్ డిమాండ్ చేశాడు. మండలంలోని తేజావత్‌రాంసింగ్ తండాలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార బలంతో ఇష్టారాజ్యంగా పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో బానోతు సక్కు, బాలు, నవీన్, రాకేష్, అమ్ము, చిక్కా, వెంకటేష్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు సూరం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ..సెప్టెంబర్ 1న సీపీఎస్ రద్దు కోసం తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్ఎం యాకయ్య, మండల కార్యదర్శి రమేష్, వీరన్న, దేవేందర్, రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

నర్సింహులపేట: మండలంలోని జయపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మందుల యాకయ్య తన తల్లి చుక్కమ్మ జ్ఞాపకార్థం ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులను పంపిణీ చేశారు. ఎంఈఓ రామ్మోహన్‌రావు చేతుల మీదుగా అందజేశారు. హెచ్ఎం ఒరుగంటి వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

లైబ్రరీ పుస్తకాల..

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు లైబ్రరీ బుక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రామ్‌దాస్ కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వం అందించిన లైబ్రరీ బుక్స్‌ను హెచ్ఎంలకు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మస్కపురి సుధాకర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉపేందర్, సీఆర్‌పీలు భాస్కరరావు, వీరస్వామి, కవిత పాల్గొన్నారు.

పాదరక్షల పంపిణీ

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని అయ్యగారి పల్లి గ్రామంలో జీపీ కార్మికులకు, లయన్స్ క్లబ్ కేసముద్రం అధ్యక్షుడు మామిడి అశోక్ సహకారంతో దుస్తువులు, పాదరక్షలు, చేతి గ్లౌజ్‌లను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ మాధవపెద్ది వెంకటరెడ్డి, చార్టెడ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, యర్రం శ్రీరాములు, మోహన్ నాయక్, రాపోలు శ్రీనివాస్, రుద్ర శ్రీకాంత్, ముదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు అందించాలి



మహబూబాబాద్ అర్బన్: మోడల్ స్కూల్‌లో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందించాలని మోడల్ స్కూల్ ఉద్యోగ సిబ్బంది సంఘం జిల్లా నాయకులు పీడీ సింధువర్మ, ప్రసన్న అన్నారు. జిల్లా కేంద్రంలో డీఈఓ రవీందర్‌రెడ్డికి వేతనాలు అందించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సిబ్బంది సందీప్, భరత్, కొమరయ్య పుల్లయ్య ఉపేందర్, పాషా పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల ఉత్సవాలు

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం బోనాల వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల బోనాలు, పోతరాజు వేశధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.రవీందర్, ఉపాధ్యాయులు సుధాకర్, యుగేందర్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

జగ్నాతండాలో కార్డన్ సెర్చ్

బయ్యారం: మండలంలోని జగ్నాతండాలో మంగళవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గార్ల–బయ్యారం సర్కిల్ పరిధిలోని పోలీసు బలగాలు తండాలో ఇంటింటి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.5వేల విలువైన మద్యం, 40లీటర్ల గుడుంబా, 600లీటర్ల బెల్లం పానకం తోపాటు సరైన పత్రాలు లేని 13 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా గార్ల–బయ్యారం సీఐ రవికుమార్ మాట్లాడుతూ.. గుడుంబా తయారీని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో బయ్యారం, గార్ల ఎస్సైలు తిరుపతి, రియాజ్‌పాషా తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

గార్ల: రైల్వే మూడోలైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు రైల్వేశాఖ నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్‌కు మద్దివంచ భూనిర్వాసితులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి గౌని మల్లేశం, రైతులు శ్రీరాములు, శ్రీను, హైమద్‌పాషా ఉన్నారు.

వార్డెన్‌పై దాడి అమానుషం

గూడూరు: మండలంలోని సీతానగరం ఏహెచ్‌స్‌లోని ఉపాధ్యాయుడు, వార్డెన్‌పై దాడిని ప్రతీ ఒక్కరు ఖండించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శి సోనబోయిన రవిచంద్ర, మండల వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. వెంటనే ఈ దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం రక్షణ చర్యలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పిల్లల రక్షణపై అవగాహన

డోర్నకల్: గ్రామాల్లో చిన్నపిల్లల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని షేర్ ఎంజీఓ అండ్ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వసుంధర్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుతో కలిసి చైల్డ్ రైట్స్ కరపత్రాన్ని ఆవిష్కరించారు.


ధరలు తగ్గించాలి

నెల్లికుదురు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కృత్రిమ అధిక ధరలను తగ్గించే విధంగా చర్య తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పెరుమాండ్ల బాబుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వ్యాపారస్తులు సిమెంటు, ఇనుము అధిక ధరలకు విక్రయిస్తూ నిరుపేదల పొట్టకొడుతున్నారని అన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: ద్విచక్రవాహనం ఢీకొని మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని బలరాంతండా గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై దీపిక మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బలరాంతండా గ్రామానికి చెందిన పలువురు మహిళా కూలీలు వరినాట్లు వేసి నడిచి వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనదారుడు వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో మూడు అనితకు తీవ్రగాయాలుకాగా సోనీకి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అనితను చికిత్స నిమిత్తం మహబూబాబాద్ పట్టణానికి తరలించి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె భర్త మూడ్ కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కేలోత్ భాస్కర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గర్జన సభను విజయవంతం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఈనెల 11న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న గిరిజన హక్కుల గర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ వెంకన్ననాయక్, భూక్య హరినాయక్ పిలుపునిచ్చారు. ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండలాలు, గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని మంగళవారం జిల్లా కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఎన్నికల్లో 16 హామీలను ఇచ్చిందని, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిషన్, భూక్య శ్రీను, అశోక్, శేఖర్, గోపి పాల్గొన్నారు.